# పెనుభూతం

వెంకట్రావుగారింట్లో అందరూ కూచుని మౌనంగా ఆలోచిస్తున్నారు. వెంకట్రావు గారమ్మాయి కాంచనకి సంబంధం గురించి చెప్పడానికి వచ్చిన పురుషోత్తంగారు కూడా ఆలోచనలో పడ్డాడు.

పురుషోత్తంగారు తెచ్చినదేమీ మామూలు సంబంధం కాదు. పెళ్ళికొడుకు అనంత్ ఎమ్.టెక్. చదివి ఒక పెద్ద కంపెనీలో పని చేస్తున్నాడు. మల్టీనేషనల్ కంపెనీ అతడి ప్రతిభని గుర్తించి పదిహేను వేల రూపాయల జీతము, ఫర్నిష్‌డ్ క్వార్టర్స్, కారూ ఇచ్చి అతన్నిఉద్యోగంలోకి తీసుకుంది. అబ్బాయి అరడుగులకి రెండంగుళాలే తక్కువ పొడుగుతో, మంచి రూపంతో ఉంటాడుట. ఒక్కడే కొడుకు, చెల్లెలు పెళ్ళయిపోయి, న్యూజిలాండ్‌లో ఉంటోంది. ఇంతమంచి సంబంధం అనగానే మామూలుగా ఎవరైనా ఎగిరిగంతేయాలి. కానీ వరకట్నాలు ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో గొప్ప సంబంధ మనగానే ఆలోచనలో పడడమే ఎక్కువ జరుగుతుందేమో.

మౌనాన్ని ఛేదిస్తూ పురుషోత్తం గారే మాట్లాడారు. "ఏమయ్యా వెంకట్రావ్, మాట్లాడవేమిటి? నీ మౌనం చూస్తే నేను తెచ్చిన సంబంధం నచ్చలేదా అని నేనే అనుమానంలో పడ్డాను. ఆ విషయమే నేనూ ఆలోచిస్తున్నాను."

"సంబంధం నచ్చకపోవడం కాదు పురుషోత్తం. అటువంటి సంబంధం తెస్తే నేనూ తూగగలనా అని నేను ఆలోచించడం తప్పంటావా?"

"ఓహో అసలు సంగతి చెప్పడం మర్చిపోయాను. పెళ్ళివారికి కట్నకానుకల మీద అసలు దృష్టిలేదు. అమ్మాయి అందచందాలూ, గుణగణాలూ, చదువు సంధ్యలూ ముఖ్యం. ఆ విషయంలో తూగగలమా అన్న సందేహం నీకు లేదు కదా."

ఆ విషయంలో తండ్రి వెంకట్రావుగారికే కాదు కాంచన గురించి తెలిసిన ఎవరికీ సందేహం రాదు. అయిదడుగుల నాలుగంగుళాల పొడుగూ, గుండ్రని ముఖమూ, విశాలమైన కళ్ళూ, పొడుగైన జుట్టూ, ఎమ్.ఫిల్ డిగ్రీ చూసిన వెంటనే నచ్చిందని చెప్పేలా వుంటుందామె. అయితే పెళ్ళి చూపులలో ఆమె అందమూ, చదువూ డిస్‌క్వాలిఫికేషన్లయిన సందర్భాలూ ఉన్నాయి. భార్యా రూపవతీ శత్రు: అన్నారు. ఇంత అందమైన అమ్మాయిని కాపాడుకోడం కష్టమని తిరిగిపోయిన వారూ ఉన్నారు. కట్నం చాలదన్నవాళ్ళూ ఉన్నారు. ఏది ఎక్కువా, తక్కువా కాకుండా తాసులో సరిగ్గా తూగినప్పుడే సంబంధం కుదురుతుంది.

మగ పెళ్ళివారికి కట్నం అక్కర్లేదన్న విషయం కాంచనను ఆనంద డోలికలతో ఊపింది. అందరు అమ్మాయిలలాగే ఆమెకూ, డబ్బుని కాకుండా తనను మెచ్చి ఎవరైనా

వివాహం చేసుకోవాలన్న కోరికా, అలా జరగకపోయినా రాజీపడే గుణమూ ఉన్నాయి.

కాంచనకు ఆనందాన్నిచ్చిన విషయం ఆమె తల్లి విమలమనస్సులో అనుమానాన్ని రేపింది.

"కట్నం వద్దంటున్నారంటే అబ్బాయిలో ఏదైనా లోపం..."

పురుషోత్తంగారు ఫక్కున నవ్వేరు.

"నగటు ఆడపెళ్ళివారిలాగే ఆలోచిస్తున్నావమ్మా. మగపెళ్ళివారు కట్నం కావాలంటే డబ్బు పిశాచులై పోతున్నారు. వద్దంటే అబ్బాయిలో ఏదైనా లోపం ఉందేమో అంటున్నారు. ఇలా రెండువైపులా పదునున్న కత్తిని ఆడపెళ్ళివారు పట్టుకోవడం వల్లనే కట్నాలు పోవడం లేదేమో."

"అదికాదు. నా భయం నాది. కాంచన ఒక్కగానొక్క పిల్ల" విమల నసిగింది.

"పదిమంది పిల్లలున్నా ప్రేమ తగుతుందా? కాంచన నాకూ కూతురు లాంటిదే. అనంత్‌కి ఎటువంటి దురభ్యాసాలూ లేవు. సిగరెట్, తాగుడువంటి అలవాట్లు లేవు. నువ్వు భయపడుతున్న లోపమే ఉంటే అది దాచిపెట్టి కట్నం తీసుకోవచ్చుగా".

విమల మనస్సులో అనుమానం మాయమయింది.

వెంకట్రావుగారు "థాంక్స్ పురుషోత్తం. మంచి సంబంధం తెచ్చేవు. ఇప్పుడే పంచాంగం చూసి మంచి రోజున పెళ్ళిచూపులకి ముహూర్తం పెట్టి వాళ్ళని రమ్మని రాస్తాను" అన్నాడు.

❖ ❖ ❖

పెళ్ళి చూపులు జరగడమూ, కాంచనా, అనంత్‌లు ఒకరికొకరు నచ్చడమూ, పెళ్ళి జరగడమూ అయిపోయాయి.

మామూలు సాంప్రదాయ పద్ధతిలో శోభనం వద్దని అనంత్ భార్యతో హనీమూన్ బయల్దేరాడు.

మిగతా అన్ని విషయాలలోనూ ఎంతో అనుకూలంగా జరిగినందువల్ల ఈ ముచ్చట లేనందుకు విమల బాధపడలేదు.

❖ ❖ ❖

పూరీలో, కోణార్కలో దేవాలయాల మీద శిల్పాలు చూస్తూ కాంచన సిగ్గుతో ముడుచుకుపోతే అనంత్ మగసిరి ఉప్పొంగేలా భుజాలు ఎగరేశాడు. కాంచన మరింత సిగ్గుతో ముడుచుకుపోయింది.

రాత్రి కాంచన స్నానం చేసి బాత్రూంలోనుంచి బయటకు వచ్చేసరికి లైటు ఆపేసి ఉంది.

"అదేమిటి మొత్తం చీకటిచేసేశారు" అంది కాంచన.

"నువ్వు సిగ్గుపడతావని" అంటూ అనంత్ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

❖ ❖ ❖

పూర్తిగా అన్నిలైట్లూ ఆపేసి చీకటి చేసే అలవాటు అతను ఇంటికి వచ్చాక కూడా వదులుకోలేదు. కాంచనకు అతనితో జీవితం ఎంత ఆనందంగా ఉన్నా ఈ విషయంలో అసంతృప్తిగా ఉండేది. తను చాలా అందకత్తెనని ఆమె నమ్మకం. తన అందాన్ని అతను చూసి మెచ్చుకోవాలని ఆమె కోరిక.

కాని మిగతా అన్ని విషయాలలోనూ మంచితనాన్ని చూపిస్తూ తనకి అన్ని విధాలా ఆనందాన్నిస్తున్నప్పుడు ఈ విషయంలో దెబ్బలాట పెట్టుకోడం ఆమెకిష్టం లేదు.

❖ ❖ ❖

"ఇంట్లో ఈరోజు వేరేపనేమీలేదు. రాత్రికి డిన్నరుందన్నారుగా. మీ బీరువా సర్దుతాను." అంది కాంచన.

అనంత్ ఒక్క క్షణం ఉలిక్కిపడ్డట్లుగా ఆమెకు అన్పించింది.

"నీకో నమస్కారం. నీకు అన్ని విషయాలలో స్వతంత్రం, అధికారం ఇచ్చాను. జీతం కూడా తెచ్చి నీ చేతుల్లోనే పెడుతున్నాను. ఇక బీరువా సర్ది రోజూ బట్టలు కూడా నువ్వే తీసిస్తే, చిన్న విషయాలలో కూడా స్వతంత్రం లేదా అని నాకన్పించచ్చు. అప్పుడు నీ స్వతంత్రాన్ని నేనూ అరికట్టచ్చు. చివరకు నీకే నష్టం రావచ్చు" అనంత్ నవ్వుతూ అన్నాడు.

అనంత్ ఆఫీసుకి వెళ్ళాక కాంచన కొంత సేపు టి.వి. పెట్టుకుంది. టి.వి. ప్రోగ్రాం విసుగొచ్చి, కొంతసేపు పేపరు చదివింది. "అబ్బ బోరు కొడుతోంది. ఏదైనా పనిచేద్దాం. మంచం మీద దుప్పట్లూ, గలేబులూ మారిస్తే సరి" అనుకుంటూ బెడ్రూంలోకి నడిచింది.

దుప్పట్లూ, గలేబులూ తీసి కొత్తవి వెయ్యబోతూ ఆమె ఒకసారి పరుపు కూడా తిరగేస్తే సరి అనుకుంటూ పరుపు కిందకి లాగింది. పరుపు కింద కన్పించిన దాన్ని చూసి ఆమెకు కళ్ళు తిరిగినట్లనిపించింది. తెల్లటి సిల్కు జాకెట్టు: ఆమె జాకెట్టుని చేత్తో తీసుకుంది. చాలా మెత్తటి సిల్కు జాకెట్టు సైజు చూస్తే తనకన్నా చక్కటి శరీర సౌష్టవం ఉన్నట్లే ఉంది. ఎవరిదై ఉంటుంది. తన వివాహానికి ముందు ఎవరైనా

చుట్టాలు ఇంటికి వచ్చి మర్చిపోయారేమో, అంతే అయి ఉంటుంది. కాంచన మనస్సు సద్దుకుంది.

మంచం మీద కొత్త దుప్పటీ వేసి, గలేబులు తొడిగిన కాంచన "ఈ జాకెట్టు బీరువాలో పెట్టేస్తేసరి. ఎవరు మర్చిపోయారో వాళ్ళకి తరువాత ఇచ్చెయ్యచ్చు" అనుకుంది. తన బీరువాలో పెట్టేద్దామనుకున్న కాంచన "నా బీరువాలో పెడితే నా జాకెట్లలో కలిసిపోయింది. ఆయన బీరువాలో పెడితేసరి" అనుకుంది. "బట్టలు సర్దద్దన్నారు కానీ బీరువా తియ్యొద్దనలేదుగా. పై వరసలో పెడితే సరి. ఏమిటో ఇన్నాళ్ళయినా ఆయన బీరువా ఎప్పుడూ తెరవలేదు. జీతం కూడా నాకే ఇవ్వడం వల్ల ఆయన బీరువా తీసే అవసరం లేదు." అనుకుంటూ బీరువా తీసిన కాంచనలో కోపం ఉవ్వెత్తున లేచింది. బీరువాలో పై వరుస నిండా జాకెట్లు, చీరలు రకరకాలవి ఉన్నాయి.

కాంచనలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఒక జాకెట్టు ఎవరైనా మర్చిపోయి ఉండచ్చు. ఇన్ని బట్టలు ఎలా ఉన్నాయి. తనకు ముందు ఈ ఇంట్లో ఒకమ్మాయి ఉందన్నమాట. తన భర్తతో సన్నిహితంగా ఉండేదన్నమాట. ఇక్కడే బట్టలు కూడా ఉన్నాయంటే ఇప్పటికీ బంధం చెడిపోలేదు. మళ్ళీ ఎప్పుడొస్తుందో.

కట్నం లేకుండా పెళ్ళి అంటే మురిసి పోయింది కానీ వెనకాల ఇంత మోసం ఉందనుకోలేదు. తనకున్న సరసాల సంగతి నలుగురికి తెలియకముందే పెళ్ళి కావాలన్న తపనతో తనని కట్నం లేకుండా చేసుకున్నట్లున్నాడు. ఎందుకైనా మంచిది. ఎదుటివాళ్ళకి ఛాన్స్ ఇవ్వడం వివేకవంతుల లక్షణం.

కాంచన ఆఫీసుకి ఫోన్‌చేసి "మన పెళ్ళికి ముందు మీ అమ్మగారు కానీ, మీ బంధువులెవరైనా కానీ మీ దగ్గరుండి మీకు వండిపెట్టేవారా?" అని అడిగింది.

"లేదే నువ్వు వచ్చేదాకా హోటల్ భోజనమే గతి, పెళ్ళయ్యాక వెయిట్ పెరిగాననని మా కొలీగ్స్ అంటున్నారు. ఇంతకీ అకస్మాత్తుగా ఈ ప్రశ్న అడిగావేమిటి?"

"ఊరికేనే" కాంచన ఫోన్ పెట్టేసి, ఉత్తరం రాసి పెట్టి, ఇంటికి తాళం వేసి, పక్కింట్లో ఇచ్చి, బస్టాండుకి బయల్దేరింది.

❖ ❖ ❖

గుమ్మంలో నిలబడిన కాంచనను చూసి విమల "ఏమిటమ్మా ఇంతసడన్‌గా వచ్చావు. ఫోన్ చేసి బయల్దేరితే స్టేషన్‌కి వచ్చేవాళ్ళంగా" అంది.

"మిమ్మల్ని చూడాలనిపించింది. వెంటనే వచ్చేశాను. ట్రెయిన్‌కి రాలేదు. బస్సులో వచ్చాను" అంది కాంచన.

❖ ❖ ❖

సాయంత్రం ఇంటికొచ్చి వీధి గుమ్మానికి తాళం చూసిన అనంత్ ఖంగుతిన్నాడు. పక్కింటావిడ అతన్ని చూసి తాళం ఇచ్చింది. లోపలకు వెళ్ళగానే కాంచన రాసిన ఉత్తరం టేబిల్ మీద కన్పించింది.

"మీరింత గ్రంథసాంగులనుకోలేదు. కట్నం కూడా లేకుండా వరించారంటే మురిసిపోయాను. కాళ్ళకింద పడుండే దాని కోసం చూస్తున్నారని తెలియలేదు. నేను ఎవరితోటీ ఏదీ పంచుకోను. నాకు ఎంగిలి వస్తువులు అసహ్యం. గుడ్‌బై - కాంచన."

ఆమె ఉత్తరం అనంత్‌కి అర్థంకాలేదు. తన మీద ఎవరైనా ఏమైనా చెప్పి ఉంటారా? ఇంత అకస్మాత్తుగా ఎందుకు వెళ్ళిపోయిందో.

లోపలకు వెళ్ళిన అనంత్‌కి బెడ్రూంలో బీరువా తలుపులు తీసి ఉండడం కన్పించింది. కాంచన ఎందుకు వెళ్ళిపోయిందో అతనికి అర్థమయింది. తమ వివాహమై ఎన్నాళ్ళోకాలేదు. మెల్లిగా తనే కాంచనకు విషయం చెప్దామనీ, ఆమె అర్థం చేసుకుంటుందనీ ఆశించాడు. పెళ్ళికి ముందే కాంచనకు చెప్పి ఉండాల్సిందా. అప్పుడామెకు అర్థమయ్యేదా. భార్యాభర్తల మధ్య రహస్యాలు ఎంతవరకూ ఉండవచ్చు. రహస్యం ముందే చెప్తే వివాహమయ్యేదా?

పోనీ ఇప్పుడు చెప్పేస్తే.. కాంచన ఇంకా వాళ్ళ ఇంటికి చేరి ఉండదు. చేరిన తరువాత రెండు రోజులకి కానీ ఆమెలో ప్రథమకోపం తగ్గదు. అప్పుడు చెప్తేసరి.

❖ ❖ ❖

రెండు రోజుల తర్వాత విమల కాంచనను అడిగింది. "అమ్మాయ్ క్షేమంగా చేరినట్లు అల్లుడికి ఫోన్ చేసి చెప్పలేదేం.

"నా యోగక్షేమం అంత ముఖ్యమనుకుంటే ఆయనే చేస్తారులే."

వెంకట్రావుగారు "నీకు చిన్నప్పటుండే దుడుకుతనం పోలేదు కాంచనా. సంసారంలో సహనం ముఖ్యం" అన్నారు.

కాంచన జవాబిచ్చేలోగా ఫోన్ మోగింది. ఫోన్ పక్కనే ఉన్న విమల ఫోన్ తీసి, మాట్లాడి "కాంచనా. నీకే ఫోన్ అల్లుడుగారు చేశారు" అంది.

కాంచన ఫోన్ తీసుకుని "హలో" అంది.

విమలా, వెంకట్రావుగారూ కుతూహలంగా వింటున్నా, విననట్లుగా నటిస్తూ కూచున్నారు.

అనంత్ "కాంచనా, నాతో మాట్లాడితే విషయం వివరంగా చెప్పేవాణ్ణిగా. అలా చెప్పాపెట్టకుండా వెళ్ళి పోయావేం' అన్నాడు.

"మిమ్మల్ని అడిగాను. మీరు చెప్పారు. ఆతర్వాతే బయల్దేరాను."

"నన్నా? ఏమడిగావు?"

"మళ్ళీ అడుగుతున్నాను. మన పెళ్ళికి ముందు మీ అమ్మగారు కానీ, చెల్లెలుకానీ, బంధువులుకానీ మీ దగ్గరున్నారా?

"లేరు."

"పోనీ మీ ఫ్రెండ్స్ ఎవరైనా ఫామిలీతో ఉన్నారా?"

"లేరు. నన్నుచెప్పనీ."

"నేను అడుగుతాను. ఎవరైనా ఫామిలీకి పేయింగ్ గెస్ట్ ఎకామిడేషన్ ఇచ్చారా?"

"లేదు. కాంచనా నేను చెప్పేది విను."

"ఇంక వినడానికేముంది? నన్ను బీరువా ఎందుకు తియ్యొద్దన్నారో తెలిసింది. మీ ప్రేమకథలు తెలుస్తాయని.'

"కాంచనా, నన్ను పూర్తిగా చెప్పనీ." కాంచన ఫోన్ పెట్టేసింది. విమలా, వెంకట్రావుగారూ భయంగా చూస్తున్నారు.

"విన్నారుగా, బీరువాలోపై అరనిండా చీరలూ, జాకెట్లూ, మిగతా బట్టలూ ఉన్నాయి. ఎవరూ, ఎప్పుడూ రాలేదంటున్నారు. ఇక ఆ బట్టలెవరివి? నా బతుకిలా అవుతుందనుకోలేదు."

వెంకట్రావుగారిలో కోపం ఉవ్వెత్తున లేచింది. విమల మెల్లిగా కాంచన నుంచి విషయం తెలుసుకుంది. ఆమెకీ ఏంచెప్పాలో తెలియలేదు.

ఇంకో అమ్మాయితో ముందు సంబంధమున్నా ఆమె బట్టలు ధైర్యంగా ఇంట్లో ఎవరైనా ఉంచుకుంటారా?

వెంకట్రావుగారి కోపం పురుషోత్తంగారి మీదకి మళ్ళింది. ఫోన్ చేసి 'ప్రాణ స్నేహితుడవని నమ్మాను. ఇంత ద్రోహం చేస్తావా" అన్నారు.

"నేనేం ద్రోహం చేశాను?"

"అనంత్ విషయం దాచిపెట్టలేదూ."

"నేను ఏవిషయం దాచాను?" పురుషోత్తంగారి కంఠంలోని భయం ధ్వనించింది. నిజంగానే అనంత్‌లో లోపం లేదుకదా.

"అనంత్‌కి ఒకమ్మాయితో సంబంధముందని దాచలేదా."

"వెంకట్రావ్, కాంచన నా కూతురి లాంటిది. అనంత్‌లో ఏదుర్గుణమున్నా నేను దాచి పెడతానా? నువ్వు ఎంత స్నేహితుడివో, అనంత్ తండ్రి అలాగే మిత్రుడు. అతని గురించి నాకు అన్ని విషయాలూ తెలుసు. అనంత్ గుణాలకి - నేను హామీ."

"అయితే అతని బీరువా నిండా చీరలు ఎందుకు ఉన్నాయి?"

"చీరలా? ఎవరివైనా కావచ్చును."

"అలాగే అంటావులే" అంటూ వెంకట్రావుగారు విషయం మొత్తం చెప్పారు. రెండోవైపు నుంచి కొంచెం సేపు దాకా మాటలేదు.

"ఏం మాట్లాడుతావులే. విషయం ఇంత తొందరగా బయటపడుతుందనుకో లేదా" వెంకట్రావుగారు రెట్టించారు.

"సంబంధం కుదిర్చిన నాకు నిజం తెల్సుకునే బాధ్యత వుంది. నేను ఈరోజే అనంత్ దగ్గరకు వెడుతున్నాను."

❖ ❖ ❖

గుమ్మంలో నిల్చున్న పురుషోత్తంగారితో అనంత్ "లోపలికి రండి. మీరు వస్తారనే అనుకున్నాను" అన్నాడు.

"వచ్చి తీరాల్సిన పరిస్థితి. కాంచన చెప్పిన విషయం అంతుపట్టకుండా ఉంది. నిన్ను చిన్నప్పటినుంచీ ఎరుగుదును. నువ్విలాంటి పని చేస్తావనుకోలేదు."

"మీరు కూడా నన్ను అనుమానిస్తున్నారా?"

"చీరలెవరివో నువ్వు చెప్పలేకపోయావుట."

"కాంచన చెప్పనివ్వలేదు."

"అంతే అనుకున్నాను. కాంచనకు తొందరపాటు ఎక్కువ. బంధువులెవరైనా మర్చిపోయి, వెళ్ళిపోయారా?"

"లేదు. చీరలు బంధువులవీ, ఫ్రెండ్స్‌వీ కావు."

"అయితే..." పురుషోత్తంగారిలో అనుమానం మొదలైంది.

"నన్ను నమ్మండి. నేను కాంచనకు ద్రోహం చెయ్యలేదు. చెయ్యను."

"మరి చీరలూ, జాకెట్లూ... "

అనంత్ మాట్లాడలేదు.

"చెప్పు అనంత్. నీ తండ్రిలాంటివాడ్ని. నీ ఫ్రెండ్స్ ఎవరైనా నీ ఇంటిని తప్పుడు పనులకి వాడుకున్నారా?"

"లేదు. నాకు ఎలా చెప్పాలో తెలియడం లేదు. చెప్పలేని సమస్య" అనంత్ గొంతు వణికింది.

"చెప్పకపోతే ఇంకా పెద్ద సమస్యగా మారుతుంది కదా."

"నాకు ఆసమయంలో ... "

అనంత్ ఆగాడు. పురుషోత్తంగారు మెల్లిగా చెప్తాడులే అన్నట్లుగా మాట్లాడకుండా కూచున్నారు.

"చెప్పడానికి సిగ్గుగా ఉంది. మీరు అర్థం చేసుకుందుకు ప్రయత్నించండి. ఏకాంతంలో ఉన్నప్పడు నాకు చీరకానీ, జాకెట్టుకానీ చేత్తో ఉంచుకుంటే కానీ వలపు భావాలు రావు. ఈ అలవాటు పెళ్ళికి ముందు నుంచే ఉంది. అందుకే పెళ్ళయ్యాక లైట్లన్నీ తీసేసేవాణ్ణి. అలవాటు పెళ్ళి తరువాత పోతుందనుకున్నాను. పోలేదు. మెల్లిగా కాంచనకు చెప్దామనుకున్నాను. తను అర్థం చేసుకుంటుందని నమ్మకం కలిగాక చెప్దామనుకున్నాను."

పురుషోత్తంగారు మెల్లిగా అడిగారు.

"మరి అన్ని చీరలూ, జాకెట్లూ ఎందుకు."

"వెరైటీకోసం."

అనంత్ మనస్తత్వం పురుషోత్తంగారికి అర్థం కాలేదు. కానీ అతనికి ఇతరత్రా సంబంధాలు లేవన్న ఊహ ఆనందాన్నిచ్చింది.

❖ ❖ ❖

"మానవ ప్రకృతి విచిత్రమైంది పురుషోత్తంగారూ, ఎవరు ఎందుకు ఎలా ప్రవర్తిస్తారో చెప్పలేము. ఏదైనా వస్తువును చూస్తేనో, ముట్టుకుంటేనో కానీ కోరిక కలగకపోడాన్ని ఫెటిషిజం అంటారు. సాధారణంగా మగవారి విషయంలో స్త్రీలకి సంబంధించిన వస్తువులు కోరికని కలిగిస్తాయి. ఈ ప్రవర్తన వల్ల ఎవరికీ హాని కలగదు. జీవిత భాగస్వామికి అభ్యంతరమన్పిస్తే ట్రీట్ చెయ్యచ్చు" పురుషోత్తంగారితో ఆయన కలుసుకున్న డాక్టరు చెప్పాడు.

❖ ❖ ❖

విషయం విన్న కాంచన తాను ఆరోజే బయల్దేరి వస్తున్నానని భర్తతో చెప్పడానికి ఫోన్ ఎత్తింది.

(మయూరి)